క్లుప్తంగా

ముక్కిడి పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



పాల్గొన్న భక్తులు

మంచిర్యాలఅర్బన్: స్థానిక శ్రీశ్రీ నగర్‌లో ముక్కిడి పోచమ్మ విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమాలు శనివారం ప్రారంభమయ్యాయి. రెండు రోజుల కార్యక్రమంలో భాగంగా రామగుడం రాముశర్మ ఆధ్వర్యంలో పూజలు చేపట్టారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. 22న విగ్రహ ప్రతిష్ఠాపన ఉంటుందని వార్డు కౌన్సిలర్ హరికృష్ణ తెలిపారు.

జాతర విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: మహారాష్ట్రలోని సిరోంచలో ఈనెల 25న జరగనున్న పూలే సాహు అంబేద్కర్ బహుజన జాతరను విజయవంతం చేయాలని బహుజన సంఘాల నాయకులు కోరారు. జిల్లా కేంద్రంలో జాతర పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. సిరోంచ బహుజన జాతర కమిటీ సభ్యులు శంకర్, కుమ్మరి శుభం, బీసీ ఐక్యవేదిక నాయకులు మల్లయ్య, సమతా సైనిక్‌దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుర్గం రామ్మూర్తి, సామాజిక న్యాయవేదిక జిల్లా కన్వీనర్ రాజేశం, సామాజిక ఉద్యమకారుడు జయరావు పాల్గొన్నారు.

సంస్మరణ సభ



బుద్ది చంద్రమౌళి చిత్రపటం వద్ద నివాళు లర్పిస్తున్న బీసీ ఐక్యవేదిక నాయకులు

పాతమంచిర్యాల: ఈనెల 19న బీసీ ఐక్యవేదిక వ్యవస్థాపకుడు బుద్ది చంద్రమౌళి మృతిచెందడంతో జిల్లా కేంద్రంలోని బీసీ భవనంలో శనివారం సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద బీసీ సంఘాల నాయకులు నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. బీసీ ఐక్యవేదిక నాయకులు మల్లయ్య, అంజయ్య, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రాజేశం, బీసీ యూత్ నాయకులు చంద్రకాంత్, సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జైపాల్‌సింగ్, బీమా ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి రాందాస్ పాల్గొన్నారు.

155 మందికి కంటి ఆపరేషన్లు



రోగులకు పండ్లు అందజేస్తున్న సభ్యులు

చెన్నూర్: చెన్నూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మూడు విడుతల్లో 155 మంది కంటి ఆపరేషన్లు చేయించామని చెన్నూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జాడి తిరుపతి, డిస్ట్రిక్ చైర్‌పర్సన్ మోదుంపురం వెంకటేశ్వర్లు తెలిపారు. కరీంనగర్ జిల్లా రేకుర్తి ఆసుపత్రిలో కంటి ఆపరేషన్లు చేయించుకుని చెన్నూర్‌కు తిరిగి వచ్చిన రోగులకు స్థానిక సాయిరాం ఫంక్షన్ హాల్‌లో పండ్లు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు గర్రెపల్లి వెంకటనర్సయ్య, నిమ్మల సాగర్, శ్రీనివాస్, శ్రీపాల్ పాల్గొన్నారు.

ఉచిత ఎలక్ట్రీషియన్ శిక్షణ

మంచిర్యాలటౌన్: గౌతం రాజేశ్వరి చారిటబుల్ ట్రస్టు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన మహిళలు, పురుషులకు ఉచితంగా ఎలక్ట్రీషియన్ శిక్షణ ఇవ్వనున్నట్లు ట్రస్టు డైరెక్టర్ సరిత, సీఈవో శ్రీనివాస్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 24లోపు చున్నంబట్టి రైల్వే ఓవర్‌బ్రిడ్జి పక్కన కైలాసగిరికాలనీలో గల దీప్తి బొటిక్ సెంటర్‌లో సంప్రదించాలని సూచించారు.

సీసీఐలో బీబీ స్పెషల్ మోడ్ పత్తి

బెల్లంపల్లి: బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రంలో బీబీ స్పెషల్ మోడ్ పత్తి అమ్మకానికి వస్తున్నట్లు మార్కెట్ కమిటీ ఇన్‌చార్జి కార్యదర్శి ఎస్.భాస్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. బీబీ స్పెషల్ మోడ్ పత్తి క్వింటాల్‌కు మద్దతు ధర రూ.7,471 చెల్లించి కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఈప్రక్రియ ఈనెల 23 నుంచి అమలులోకి వస్తుందని పేర్కొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం



నెన్నెలలో గణిత నమూనాలను వివరిస్తున్న విద్యార్థులు



వివేకానంద పాఠశాలలో 1729 ఆకారంలో విద్యార్థులు

జన్నారం/దండేపల్లి/నెన్నెల/మంచిర్యాలఅర్బన్/చెన్నూర్‌రూరల్/బెల్లంపల్లి/భీమిని/మందమర్రి రూరల్: గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతి పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా విద్యాసంస్థల్లో శనివారం గణిత దినోత్సవాన్ని, నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వివిధ పాఠశాలల్లో గణిత ప్రదర్శనలు, గణిత క్విజ్ పోటీలు నిర్వహించారు. గణిత సూత్రాలతో విద్యార్థులు ముగ్గులు వేశారు. తాము తయారు చేసిన గణిత ప్రయోగ నమూనాలు ప్రదర్శిస్తూ వివరించారు. ఇందులో ప్రతిభ కనబర్చినవారికి బహుమతులు అందజేశారు. కన్నెపల్లి ఉన్నత పాఠశాలలో గణితశాస్త్ర ఉపాధ్యాయులు సతీశ్, శ్రీకాంత్, విశ్వనాథ్‌లను సన్మానించారు.

- జన్నారం మండలంలోని వివేకానంద పాఠశాల విద్యార్థులు రామనుజం నంబర్ 1729 ఆకారంలో కూర్చోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.
- మంచిర్యాలలోని ఆల్ఫోర్స్ పాఠశాలలో విద్యార్థులు గణిత ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.
- చెన్నూర్ మండలం కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు గణిత శాస్త్ర ప్రాధాన్యత గురించి ప్రిన్సిపాల్ ఎంవి.పట్వర్ధన్ వివరించారు. అధ్యాపకులు శ్రీనివాస్, ముకుంద్, సర్వర్‌పాషా పాల్గొన్నారు.
- పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు గణితంపై ఆసక్తి పెంచుకోవాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ కాసిపేట బాలుర గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్ అన్నారు. గురుకులంలో విద్యార్థులు గణిత ప్రదర్శనలు చేసి ఆకట్టుకున్నారు. నృత్యాలు, పాటలు, స్కిట్లు ఎంతగానో అలరించాయి.
- మందమర్రిలోని కార్మెల్ హైస్కూల్‌లో విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించిన మ్యాథ్స్ ఎగ్జిబిట్స్ ఆకట్టుకున్నాయి. వారిని హెచ్‌ఎం జేవీ ఆర్ రెక్స్ అభినందించారు.



మంచిర్యాలఅర్బన్: విద్యార్థుల గణిత ప్రదర్శనలు



కన్నెపల్లి ఉన్నత పాఠశాలలో సన్మానిస్తూ..



కార్మెల్ హైస్కూల్‌లో విద్యార్థులతో హెచ్‌ఎం

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి



బెల్లంపల్లి: అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు



జన్నారం: నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

బెల్లంపల్లి: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షాను పదవి నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బెల్లంపల్లి పాతబస్టాండ్ వద్ద శనివారం అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. దేశ ప్రజలకు ఆయన క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్.రవి, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి జి.అశోక్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎ.రమణ, మండల కన్వీనర్ దేవదాస్, వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.బ్రహ్మయ్య, రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి రాములు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా కార్యదర్శి డి.మోహన్, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు అరవింద్, పవన్‌కల్యాణ్, డి.శ్రీకాంత్, నిఖిల్, నవీన్, ప్రదీప్, జశ్వంత్, మంజునాథ్ పాల్గొన్నారు.

క్షమాపణ చెప్పాలి

జన్నారం: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వెంటనే దేశప్రజలకు క్షమాపణ చెప్పాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అశోక్, లింగన్న డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద నిరసన తెలిపారు. నాయకులు బుచ్చయ్య, లక్ష్మణ్, దాసండ్ల రాజన్న, గుడ్ల రాజన్న, ఎస్‌కే అబ్దుల్లా పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం

తాండూర్: మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో అమిత్‌షా దిష్టిబొమ్మను శనివారం దహనం చేసి నిరసన తెలిపారు. ఐబీ కేంద్రంలోని జాతీయ రహదారిపై రాస్తారోకో చేసి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం మాట్లాడుతూ అమిత్ షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. రాజేశం, నానయ్య, మహిళ అసంఘటిత కార్మికులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

దండేపల్లి: విద్యాప్రవేశ్ ప్రోగ్రాంలో భాగంగా మండలంలోని పెద్దపేట ప్రాథమిక పాఠశాలను జాతీయ పరిశీలకులు శ్రీనివాస్, కల్పన శనివారం సందర్శించారు. పాఠశాల ప్రార్థన సమయం మొదలుకుని, ఇంటి బెల్ వరకు పాఠశాలలోనే గడిపి ప్రతి అంశాన్ని పరిశీలించి, వివరాలు నమోదు చేసుకున్నారు. హెచ్‌ఎం శ్రీలత, ఉపాధ్యాయురాలు విశాలిని పాల్గొన్నారు.

నెన్నెల పోలీస్‌స్టేషన్ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఏసీపీ రవికుమార్

నెన్నెల: నెన్నెల పోలీస్‌స్టేషన్‌ను బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ శనివారం సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌లో సిబ్బంది నిర్వహిస్తున్న విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. కేసులు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు దృష్టిలో పెట్టుకొని ప్రణాళికతో పకడ్బందీగా పటిష్టం చేయాలని ఎస్సై ప్రసాద్‌కు సూచించారు. గ్రామాల్లో పల్లెనిద్ర కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు దగ్గర కావాలని బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలొద్దీన్‌కు సూచించారు. స్టేషన్ పరిధిలోని భౌగోళిక పరిస్థితులు, ఈ ప్రాంతంలో ఉన్న మావోయిస్టులు, సానుభూతిపరుల వివరాలను సీఐ, ఎస్సైలను అడిగి తెలుసుకున్నారు. అక్రమ రవాణా, సమస్యాత్మక గ్రామాలపై నిఘా ఏర్పాటు చేయాలన్నారు. విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు.

కనుల పండువగా అయ్యప్ప ఆరట్టు



ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న స్వాములు

జన్నారం: మండల కేంద్రంలోని హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి ఆరట్టు ఉత్సవాన్ని శనివారం కనుల పండువగా నిర్వహించారు. గణపతి, సుబ్రహ్మణ్య, అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా బాదంపెల్లి గోదావరికి తీసుకెళ్లి వేద పండితులు రాజనరేంద్రశర్మ, రుకేశ్ శర్మ, సంజయ్ త్రిపాఠీ జలాభిషేకం చేశారు. అనంతరం వాటిని జన్నారంలోని తెలంగాణ తల్లి విగ్రహం నుంచి అయ్యప్ప ఆలయం వరకు స్వాముల నృత్యాల మధ్య శోభాయాత్రగా వెళ్లారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు శీల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి కిషన్‌రెడ్డి, కోశాధికారి రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్



తయారు చేసిన వంటకాలతో విద్యార్థులు

దండేపల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఫుడ్ ఫెస్టివల్ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు ఇళ్లల్లో వివిధ రకాల వంటకాలు తయారు చేసి వాటిని పాఠశాలలో ప్రదర్శనగా ఉంచారు. ఆ వంటకాలను హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు రుచి చూశారు. వంటలపై అవగాహన కల్పించడానికి ఇలాంటి కార్యక్రమం నిర్వహించినట్లు హెచ్‌ఎం తెలిపారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

బెల్లంపల్లిరూరల్: ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకోవడంతోనే ఆరోగ్యంగా ఉంటారని ఆకెనపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రాజేశ్వరి అన్నారు. పాఠశాలలో శనివారం తెలంగాణ ఆహారోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పలు రకాల వంటకాలను తయారు చేసి పాఠశాలకు తీసుకవచ్చి ప్రదర్శించారు. ఉపాధ్యాయులు జ్యోతి, అంగన్‌వాడీ టీచర్ పద్మ, ఆయా శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: మండలంలోని పొక్కూరు జెడ్పీ సెకండరీ పాఠశాలలో శనివారం తెలంగాణ ఆహారోత్సవం, పోషకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం దత్తకుమార్ మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థుల పోషణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

దండేపల్లి: మండలంలోని కొండాపూర్‌కు చెందిన ఇప్ప రాజవ్వ(48) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఎస్సై ఉదయ్‌కిరణ్ కథనం ప్రకారం.. ఈనెల 17న స్నానం చేసేందుకు రాజవ్వ బాత్రూమ్ వెళ్తుండగా జారిపడడంతో తలకు గాయమైంది. ఆమెను మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మెదడులో రక్తస్రావమైనట్లు తెలిపారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ప్రతిమ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. కుమారుడు వెంకటేశ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాల సందర్శన

మందమర్రిరూరల్: మందమర్రిలోని కేకే-5 ఫిల్టర్ బెడ్ ఏరియా సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శనివారం నో బ్యాగ్ డే సందర్భంగా క్షేత్ర పర్యటనలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించారు. ఎంపీడీవో, తహసీల్దార్, విద్యావనరుల కేంద్రాలను సందర్శించి సిబ్బంది పనులు, ప్రజలకు జరిగే సేవల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో విద్యార్థులు➤



బొగ్గుబాయి వార్తలు

ఉత్పత్తిలో ముందంజలో ఉండాలి



కార్మికులతో మాట్లాడుతున్న జీఎం సూర్యనారాయణ

- జీఎం ఎల్వీ సూర్యనారాయణ

శ్రీరాంపూర్: బొగ్గు ఉత్పత్తిలో శ్రీరాంపూర్ ఏరియా అన్ని ఏరియాల కంటే ముందంజలో ఉండాలని శ్రీరాంపూర్ జీఎం ఎల్వీ సూర్యనారాయణ తెలిపారు. శనివారం శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్, ఆర్కే న్యూటెక్ గనులపై మల్టీ డిపార్ట్‌మెంటల్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. బొగ్గు ఉత్పత్తిలో నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలన్నారు. ఉత్పత్తి చేసిన బొగ్గును సకాలంలో రవాణా చేయాలన్నారు. ప్రతి ఉద్యోగి సంస్థ స్థితిగతులపై అవగాహన కల్పించడానికే కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమాల్లో గుర్తింపు సంఘం బ్రాంచి కార్యదర్శి ఎస్కే బాజీసైదా, కమిటీ టీం 1 కన్వీనర్, ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, టీం 2 కన్వీనర్, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్ రెడ్డి, కమిటీ సభ్యులు ఏజీఎం (ఫైనాన్స్) మురళీధర్, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, డీజీఎం (ఐఈడీ)చిరంజీవిలు, కె.వి రామకృష్ణ, అమర్నాథ్ రెడ్డి, కట్టా శ్రీధర్‌తోపాటు ఓపెన్ కాస్ట్ గని ప్రాజెక్టు అధికారి టి.శ్రీనివాస్, ఓసీపీ గని మేనేజర్ బ్రహ్మాజీ, సంక్షేమ అధికారులు బి.శంకర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

యువ ఉద్యోగుల రక్తదానం



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందిస్తున్న జీఎం సూర్యనారాయణ

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ వీటీసీలో శిక్షణ పొందుతున్న 45 మంది యువ ఉద్యోగులు రక్తదానం చేశారు. ఆర్కే 8 డిస్పెన్సర్‌లో శనివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. శ్రీరాంపూర్ జీఎం ఎల్వీ సూర్యనారాయణ వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. జీఎం మాట్లాడుతూ ఉద్యోగులు సామాజిక సేవలో ముందుండాలన్నారు. ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచి కార్యదర్శి బాజీసైదా, ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, ఇందారం ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు అధికారి ఏవీ రెడ్డి, వీటీసీ మేనేజర్ వెంకటరామారావు, డిస్పెన్సరీ పిట్ సెక్రెటరీ విజయలక్ష్మి, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు కాసర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

రామకృష్ణాపూర్: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ అనుబంధ కాంట్రాక్ట్ కార్మికుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సివిల్ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచుతామని 30 శాతం పీఆర్సీ అమలుచేస్తామని గత ప్రభుత్వం మోసం చేయగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు నెరవేర్చడం లేదన్నారు. కోలిండియాలో మాదిరిగా సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు బ్రహ్మానందం, శంకర్, నిరంజన్, అప్పారావు, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి డేను సెలవుదినంగా ప్రకటించాలి

శ్రీరాంపూర్: ఈ నెల 23న జరిగే సింగరేణి ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని ఉద్యోగులందరికీ వేతనంతో కూడిన సెలవునివ్వాలని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, బ్రాంచి ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, నాయకులు బండి రమేశ్, పొగాకు రమేశ్, పానుగంటి సత్తయ్య ఓ ప్రకటనలో యజమాన్యాన్ని డిమాండ్ చేశారు. కార్మిక కుటుంబాలు ఉత్సవాల్లో పాల్గొనాలంటే సెలవు ఉండాలని పేర్కొన్నారు. దీనిపై తక్షణమే యజమాన్యం స్పందించి సెలవు ఇవ్వాలన్నారు.

మందమర్రిరూరల్: సింగరేణి డేను వేతనంతో కూడిన సెలవు దినంగా యాజమాన్యం ప్రకటించాలని హెచ్‌ఎంఎస్ మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఏరియాలోని యూనియన్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. నాయకులు వెల్డి సుదర్శన్, శ్రీనివాసరెడ్డి, అశోక్‌కుమార్, రామస్వామి పాల్గొన్నారు.

ఎస్టీపీపీలో దీపాలంకరణ పోటీలు

జైపూర్: సింగరేణి ఆవిర్భావ వేడుకలు పురస్కరించుకొని శనివారం ఎస్టీపీపీలో మహిళలకు దీపాలంకరణ పోటీలు నిర్వహించారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొని రంగురంగుల ముగ్గులు వేసి వాటిని దీపాలతో అలకరించారు. ఎస్టీపీపీ జీఎం శ్రీనివాసులు, ఏఐటీయూసీ పిట్ సెక్రెటరీ సత్యనారాయణ, సీఎంవోఏఐ ప్రెసిడెంట్ శ్రీనివాస్, డీజీఎం పంతుల, వారి కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

ఉత్తమ గృహాల ఎంపిక

మందమర్రిరూరల్: సింగరేణి ఆవిర్భావ వేడుకలు పురస్కరించుకుని మందమర్రి ఏరియాలోని ఉత్తమ గృహాల పోటీల్లో భాగంగా అధికారులు శనివారం పలు గృహాలను సందర్శించి ఎంపిక చేశారు.ఈనెల 23న సింగరేణి హైస్కూల్ మైదానంలో నిర్వహించే ఆవిర్భావ వేడుకల్లో ఇంటి యజమానులకు బహుమతులు అందిస్తారని తెలిపారు. ఏరియా ఎస్వో టూ జీఎం విజయ్‌ప్రసాద్, ఫారెస్ట్ ఆఫీసర్ రమణారెడ్డి, ఎస్టేట్ ఆఫీ సర్ రమణారెడ్డి, డీవైపీఎం సత్యబోస్ ఉన్నారు.

సొంతింటి కల నెరవేర్చాలి

శ్రీరాంపూర్: కార్మికులు చాలా కాలంగా ఎదురుచూస్తున్న సొంతింటి కలను నెరవేర్చాలని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి అనిల్‌రెడ్డి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కొత్తగూడెంలో జరిగే సింగరేణి ఆవిర్భావ వేడుకల్లో పాల్గొంటున్న సంస్థ సీఎండీ బలరాంనాయక్ దీనిపై ప్రకటన చేయాలని పేర్కొన్నారు. కార్మికులకు పెర్క్స్‌పై ఆదాయపన్ను మాఫీ చేయాలని కోరారు. సింగరేణి డే సందర్భంగా కార్మికులకు ఇచ్చే అవార్డులు నిష్పక్షపాతంగా ఎంపిక చేసిన ఇవ్వాలని పేర్కొన్నారు.

సబ్సిడీపై వరి విత్తనాలు పంపిణీ

మందమర్రిరూరల్: వెంకటాపూర్, అందుగులపేట, తిమ్మాపూర్ రెవెన్యూ గ్రామాలకు చెందిన 28 మంది రైతులకు శనివారం జాతీయ ఆహార భద్రత మిషన్ ద్వారా సబ్సిడీ ద్వారా ధృవీకృత వరి విత్తనాలను చెన్నూర్ ఏడీఏ బానోత్ ప్రసాద్ పంపిణీ చేశారు. ఏవో కిరణ్మయి, ఏఈవోలు తిరుపతి, ఐతులు ఉన్నారు.

సన్మానం

చెన్నూర్: చెన్నూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం పీఆర్టీయూ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు కొట్టె శంకర్ హాజరై మాట్లాడారు. పీఆర్టీయూని బలోపేతం చేయాలని సూచించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికై తొలిసారిగా చెన్నూర్‌కు వచ్చిన జిల్లా అధ్యక్షుడు కొట్టె శంకర్‌ను చెన్నూర్ మండల శాఖ అధ్యక్షులు జోడు మధు, ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి సన్మానించారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కుమార్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆర్కే ప్రసాద్ పాల్గొన్నారు.